క్లుప్తంగా

మోడల్ స్కూల్ ప్రవేశాల దరఖాస్తు పొడిగింపు

ఇల్లంతకుంట: రహీంఖాన్‌పేటలోని మోడల్ స్కూల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకునే తేదీని పొడిగించినట్లు ప్రిన్సిపాల్ జి.గంగాధర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6వత రగతిలో 100 సీట్లు, 7, 8, 9, 10వతరగతిలో మిగిలిన సీట్లకు ప్రవేశ పరీక్ష ద్వారా భర్తీ చేస్తామన్నారు. మార్చి 10 లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

బోయినపల్లి: తెలంగాణ మోడల్ స్కూల్ బోయినపల్లిలో 2025–26 విద్యాసంవత్సరానికి ఆరోతరగతిలో వంద సీట్ల భర్తీకి, 7 నుంచి 10వతరగతి వరకు ఖాళీ సీట్ల భర్తీకి ప్రవేశాలకు గాను ఆన్‌లైన్‌లో మార్చి 10 వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎరువ రఘునాథ్ కోరారు.

నిధులు మంజూరు చేయాలి

బోయినపల్లి: మండల కేంద్రం నుంచి మర్లపేట వెళ్లే దారిలో ఉన్న బ్రిడ్జి పూర్తిగా చెడిపోయి ప్రమాదకరంగా ఉందని, వెంటనే నూతన బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని సీపీఎం మండల కన్వీనర్ గురజాల శ్రీధర్ శుక్రవారం కోరారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం



ఇల్లంతకుంట: పొత్తూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఎంఎన్ఆర్‌జీఎస్ పథకం కింద మంజూరైన కేంద్ర నిధులు రూ.5లక్షలతో శుక్రవారం డ్రైనేజీ పనులు ప్రారంభించారు. 200 మీటర్ల డ్రైనేజీ పనుల నిర్మాణం చేపట్టనున్నట్లు బీజేపీ మండల ఉపాధ్యక్షుడు గుంటి మహేశ్ తెలిపారు. గుంటి అనిల్, గుంటి మహేశ్, రమేశ్, మహేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాజన్న భక్తులకు ఆయుర్వేద వైద్య సేవలు



వేములవాడ: మహాశివరాత్రి జాతరలో ఆయుర్వేద వైద్యులు వైద్యశిబిరం నిర్వహించి భక్తులకు సేవలందించినట్లు వైద్యాధికారి స్వరూప, జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ శశిప్రభ శుక్రవారం తెలిపారు. రెండు రోజులపాటు జాతర భక్తులకు తమ సేవలందించామన్నారు. వైద్యాధికారులు శ్వేత, బీలు కుమారి, ఫార్మసిస్టులు పుష్పలత, లావణ్య, ప్రవీణ్‌కుమార్, యోగా శిక్షకులు కృష్ణ, రిషిక ఉన్నారని చెప్పారు.

మైనార్టీలను విస్మరించిన ప్రభుత్వం

బోయినపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడిచినా మైనార్టీలను విస్మరించిందని మండల కోఆప్షన్ మాజీ సభ్యుడు మహ్మద్ అజ్జు అన్నారు. శుక్రవారం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో మైనార్టీలకు ఒక్క మంత్రి పదవి సైతం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

హామీలు నెరవేర్చాలి



వీర్నపల్లిలో పోస్ట్ కార్డు ఉద్యమం చేస్తున్న ఉద్యమ కళాకారులు

వీర్నపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమ కళాకారులకిచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ సాంస్కృతిక శాఖ మండల అధ్యక్షుడు నేరల్ల ముత్యం తెలిపారు. శుక్రవారం మండలంలోని ఉద్యమ కళాకారుల ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి పోస్ట్ కార్డు ద్వారా తమ డిమాండ్లను రాసి పంపారు. దర్శనాల లింబాద్రి, భూత అంజయ్య, బోయిని రవి, వీటూరి సతీశ్, పర్శరాములు, దేవయ్య, నాగరాజు, జనార్దన్, చంద్రమౌళి, గణేశ్, అన్నారం జనార్దన్, జంగం అంజయ్య, దాసరం నారాయణ, దేశరాజు సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

వసతులు మెరుగు.. ఆటలు మస్తు..



ఆడుకుంటున్న చిన్నారులు



ఆట వస్తువులతో చిన్నారులు

- ఆకర్షణీయంగా పీఎంశ్రీ ప్రీప్రైమరీ స్కూల్స్

ఇల్లంతకుంట: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడానికి పాఠశాలలను ఆకర్షణీయంగా తయారు చేస్తున్నారు. ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపురం ప్రాథమిక పాఠశాలను ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా పథకం ఫేస్–2 కింద ఎంపిక చేశారు. ఇందులో ప్రీప్రైమరీ చిన్నారులుంటారు. మూడు సంవత్సరాల నుంచి ఐదు సంవత్సరాల వరకు చిన్నారులు ఇందులో ఆటపాటలతో విద్య నేర్చుకుంటారు. వీరికి ఆటలు, పాటలు, విద్య నేర్పడానికి ఈ పథకం కింద వలంటీర్, ఆయాను కాంట్రాక్టు పద్ధతిలో నియమించారు. జిల్లాలో ఇలాంటివి కోనరావుపేట, బోయిన్‌పల్లి మండలాల్లో ఉన్నాయి. పిల్లలు ఆడుకోవడానికి ఆట సామగ్రి, కుర్చీలు, టేబుళ్లు, కప్ బోర్డులు ప్రభుత్వం పీఎంశ్రీ పథకం కింద మంజూరు చేసింది. ఊయలలు, జారుడు బల్లలు అందుబాటులో ఉన్నాయి.

పిల్లలు చదవడానికి బొమ్మలతో కూడిన స్టోరీ పుస్తకాలు కూడా ఉన్నాయి. పెద్దలింగాపురం ప్రాథమిక పాఠశాలలో మైదానం, సరిపడా తరగతి గదులున్నందున ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా పథకం కింద ప్రీప్రైమరీ సెంటర్ మంజూరు చేశారు.

హాజరు శాతం పెరిగింది



పాఠశాలలో ప్రీప్రైమరీ వారితో కలుపుకొని 95 మంది విద్యార్థులున్నారు. ప్రీప్రైమరీ ఉండడంతో పెద్ద పిల్లలతోపాటు వారి ప్రీప్రైమరీ వయసు పిల్లలను తమ వెంట తీసుకొస్తున్నారు. పిల్లల హాజరు శాతం పెరిగింది. స్కూల్ పిల్లలు రెగ్యులర్గా వస్తున్నారు. రానున్న అకాడమిక్ సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది.

– గుర్రం సందీప్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు

ప్రభుత్వ పాఠశాలలోనే పిల్లలు



పెద్దలింగాపురం ప్రాథమిక పాఠశాలలో ప్రీప్రైమరీ పాఠశాల ఏర్పడిన నుంచి ఐదోతరగతి చదువుతున్న పెద్ద అమ్మాయితో కలిసి నా చిన్న కూతురు కూడా పాఠశాలకు క్రమం తప్పకుండా వెళ్తోంది. పెద్ద తరగతి పిల్లలతో కలిసి చిన్న పిల్లలు కలిసి వెళ్తున్నారని పాఠశాలకు తప్పిస్తలేరు.

– ఆస్మ, ఐదోతరగతి విద్యార్థిని తల్లి



గంభీరావుపేట: గంభీరావుపేట–లింగన్నపేట గ్రామాల మధ్య మానేరు వాగుపై నిర్మించతలపెట్టిన హైలెవల్ వంతెన నిర్మాణానికి సంబంధించిన శిలాఫలకం కూలిపోయింది. పనులు మొదలు కాకుండానే దానికి సంబంధించిన శిలాఫలకం ధ్వంసమైంది. దీనిని చూసి ఇటు పనుల్లేవ్.. అటు ఆనవాళ్లు లేవంటూ ప్రయాణికులు పెదవి విరుస్తున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

జాతీయ సైన్స్ దినోత్సవం



వేములవాడఅర్బన్: విద్యార్థికి బహుమతి అందజేత



పెద్దూరు పాఠశాలలో..

వేములవాడఅర్బన్: అగ్రహారం పాలిటెక్నిక్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టాలకు ఓర్చినప్పుడే సరైన ఫలితాలు సాధ్యమవుతాయన్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ మాట్లాడుతూ.. విద్యార్థులు పరిశోధనలపై ఆసక్తి కలిగి ఉండాలన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు.

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రం పరిధిలోని పెద్దూరు పాఠశాలలో శుక్రవారం సైన్స్ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థుల సైన్స్ ఎగ్జిబిట్స్ ఆలోచింపజేశాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చక్రవర్తుల రమాదేవి మాట్లాడారు. ఉపాధ్యాయులు రాజమల్లు, రవికుమార్, గుండెల్లి రవీందర్, తోట శ్రీనివాస్, భాగ్యనగర్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మూఢ నమ్మకాలతో తిరోగమనం చెందుతున్న మానవ సమాజానికి విజ్ఞాన శాస్త్రం ఎంతో అవసరమని గర్జనపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంగల శ్రీనివాస్ అన్నారు. పాఠశాలలోని విద్యార్థులు సైన్స్‌కు సంబంధించిన వివిధ పరికరాలను ప్రదర్శించి ప్రయోగాలను నిర్వహించారు. సర్ సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సైన్స్ ఉపాధ్యాయులు శ్రీనివాస్, రవి, ప్రేమ్‌సాగర్‌ను సన్మానించారు. ఉపాధ్యాయులు ఉమారాణి, బలరాం, మంజుల, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల వివిధ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. క్విజ్, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు.

గంభీరావుపేట: మండలంలోని పలు విద్యాసంస్థల్లో వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించారు. మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు.

చందుర్తి: నర్సింగపూర్ జిల్లాపరిషత్ ఉన్నత, సనుగుల ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు జితేందర్, సైన్స్ ఉపాధ్యాయులు లక్ష్మణ్, పావని, ఉపాధ్యాయులు బాల్‌రెడ్డి, జాకీర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడరూరల్: శాత్రాజుపల్లిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. జేఎన్టీయూ హెచ్ఐఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ సీహెచ్ శశికళ మాట్లాడుతూ.. ప్రపంచంలో పర్యావరణ సంబంధిత సవాళ్లు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో సూక్ష్మజీవుల పాత్రను అర్థం చేసుకోవడం చాలా ముఖ్యమైందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.లావణ్య, వైస్ ప్రిన్సిపాల్ బి.సుమలత తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండల కేంద్రంతోపాటు ఆవునూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎంఈవో రాజిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రిటైర్డు ఉద్యోగులతో కలెక్టర్, జిల్లా అధికారులు

సేవలే గుర్తింపునిస్తాయి

సిరిసిల్ల: ఉద్యోగులు ఎవరైనా రిటైర్‌మెంట్ తప్పదని, విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. కలెక్టరేట్‌లో హౌసింగ్ పీడీ బి.చిన్నయ్య, డీ–సెక్షన్ పర్యవేక్షకులు జావీద్ అహ్మద్ శుక్రవారం రిటైరయ్యారు. వారిని కలెక్టర్ సన్మానించి మాట్లాడారు. ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు తమ పూర్తి సమయాన్ని కుటుంబానికి కేటాయించాలని అన్నారు. జిల్లా అధికారులు మాట్లాడుతూ.. బొమ్మెన చిన్నయ్య వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా 1984లో విధుల్లో చేరారని, విధి నిర్వహణలో భాగంగా ప్రమోషన్ పొందుతూ 2024లో పీడీ హౌసింగ్‌గా జిల్లాకు వచ్చారని, 40 ఏళ్లు సుదీర్ఘంగా తన సేవలందించారని పేర్కొన్నారు. జావీద్ అహ్మద్ 1995లో జూనియర్ అసిస్టెంట్‌గా విధుల్లో చేరారని, 2021లో తహసీల్దార్‌గా పదోన్నతి పొందారని గుర్తు చేశారు. సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రాధాభాయ్, రాజేశ్వర్, డీఆర్‌డీవో శేషాద్రి, జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా హన్మయ్యచారి



కార్యవర్గ సభ్యులు

చందుర్తి: చందుర్తి విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా చిలుముల హన్మయ్యచారిని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం గౌరవ అధ్యక్షుడు రాజూరి శ్రీకాంత్‌చారి తెలిపారు. ఉపాధ్యక్షుడిగా రాజూరి బ్రహ్మచారి, కార్యదర్శిగా రాజూరి రవీందర్‌చారి, కోశాధికారిగా రాజూరి విష్ణుకుమార్‌చారి ఎన్నికయ్యారు.

మాదిగ అమరవీరులను స్మరించుకోవాలి



మాట్లాడుతున్న లక్ష్మణ్

ఎల్లారెడ్డిపేట: జిల్లాలోని మాదిగ అమరవీరులను స్మరించుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్ కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. నేడు మండల కేంద్రాల్లో అమరవీరులకు నివాళి అర్పించిన తర్వాత మధ్యాహ్నం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిర్వహించే కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. ఎస్సీ వర్గీకరణ పోరాటంలో ప్రాణాలె అర్పించిన మాదిగ అమరవీరుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాల అధ్యక్షులు గద్దరాశి భగవంతం, శరవింద్, నాయకులు ముక్క దేవయ్య, నరేశ్, రాజేశ్, దేవయ్య, నర్సయ్య, వడ్లూరి రాజా, పొత్తూరి రాజం, శంకర్, సతీశ్, సురేష్ పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

తంగళ్లపల్లి: మండల కేంద్రంలో టీయూడబ్ల్యూజే (హెచ్–143) మండల కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా తెలిపారు. అధ్యక్షుడిగా వెంగల శ్రీనావాస్, ఉపాధ్యక్షుడిగా గదగోని సాగర్, ప్రధాన కార్యదర్శిగా జలగం అనిల్‌కుమార్, కోశాధికారిగా కలకుంట్ల శ్రీనాథ్‌రావు, సహాయ కార్యదర్శిగా రెడ్డిమల్ల దేవరాజు, సాంస్కృతిక కార్యదర్శిగా మామిడిశెట్టి దినేశ్ ఎన్నికయ్యారు.

కార్మికుల పొట్ట కొట్టొద్దు



కొత్తపేటలో కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

బోయినపల్లి(చొప్పదండి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 44 కార్మిక చట్టాలను రద్దు చేసి కార్మికుల పొట్టలు కొడుతోందని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కదారి రాములు అన్నారు. కొత్తపేటలో శుక్రవారం జరిగిన సమావేశంలో మార్చి 28న జరిగే చలో ఢిల్లీ కరపత్రం ఆవిష్కరించారు. కార్మిక సంఘ నాయకులు వెంకటేశం, మల్లేశం, రవీందర్ తదితరులున్నారు.

పరామర్శ

తంగళ్లపల్లి: తంగళ్లపల్లిలోని ఇందిరానగర్‌లో ఇటీవల జర్నలిస్టు శ్రీనాథ్ తల్లి మరణించగా.. శుక్రవారం జర్నలిస్టులు వారి కుటుంబాన్ని పరామర్శించారు. టీయూడబ్ల్యూజే(హెచ్–143) జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా, ప్రెస్ క్లబ్ మండల అధ్యక్షుడు మోర శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు దుబ్బాక రాజు, ప్రధాన కార్యదర్శి బొడ్డు రాజశేఖర్, కోశాధికారి గదగోని సాగర్, సహాయ కార్యదర్శి గాదణవేని మధు, సాంస్కృతిక కార్యదర్శి రెడ్డిమల్ల దేవరాజు, సామల గట్టు, కలికోట చందు తదితరులు పాల్గొన్నారు.

వీడ్కోలు హంగామా



ముస్తాబాద్: ముస్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీనియర్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉన్నత చదువులతో ఉన్నతంగా ఎదగాలని ప్రిన్సిపాల్ విజయ్ ఆకాంక్షించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అధ్యాపకులు విజయ్‌కుమార్, రాజు, మురళి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించండి



ఎల్లారెడ్డిపేట: ప్రజలు, ప్రభుత్వానికి వారధిగా ఉంటున్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని మండల ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులను కోరారు. ఈమేరకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డిలకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ జర్నలిస్టులకు ఎల్లారెడ్డిపేటలో నివాస స్థలాలు అందించే పనిని త్వరలోనే మొదలుపెడతామని నాయకులు పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు గౌరీ శంకర్, ప్రధాన కార్యదర్శి శ్యామంతుల అనిల్, ఉపాధ్యక్షుడు ఒగ్గు బాలరాజుయాదవ్, గౌరవ సలహాదారులు బండారి బాల్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులు కొల్లేరు కిశోర్, కట్టెల బాబు, శ్రీరామోజీ శేఖర్, షరీఫ్, శ్రీరామోజీ ప్రవీణ్, నరేశ్‌రెడ్డి, రవికాంత్, సురేశ్, కందుకూరి రవి తదితరులు పాల్గొన్నారు.

రెడీమేడ్ దుస్తులతో ఉపాధి కరువు



లేడీస్ టైలర్ అసోసియేషన్ నాయకులు

వేములవాడ: రెడీమేడ్ దుస్తులు మార్కెట్లోకి రావడంతో దర్జీలు, టైలరిస్టులకు ఉపాధి కరువవుతోందని వేములవాడ టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ టైలర్స్ దినోత్సవం సందర్భంగా అసోసియేషన్‌లో శుక్రవారం కేక్ కట్ చేసి వేడుక జరుపుకున్నారు. గౌరవాధ్యక్షులు వాసం భూమేశ్, కోశాధికారి ఖాజానహిముద్దీన్, ప్రధాన కార్యదర్శి కోడం సురేశ్, ఉపాధ్యక్షురాలు గుడుసెల ఆశ, సంయుక్త కార్యదర్శి అన్నె సంగీత, సహాయ కార్యదర్శి నాగుల సురేశ్, ప్రచార కార్యదర్శి శ్రీపతి సతీశ్, కార్యవర్గ సభ్యులు గణేశ్, మోహన్, భాగ్యశ్రీ, మధుమిత, లహరి, వేముల వజ్రమ్మ పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండల కేంద్రంలో దర్జీ సంఘం ఆధ్వర్యంలో టైలర్స్ డే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దర్జీ సంఘం నాయకులు వెన్ను నాంపల్లి, వెన్ను నవీన్, రాజేందర్, రాములు, శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి: విలాసాగర్ హైస్కూల్ విద్యార్థులు నిర్వహించారు. పలువురు బాలికలు కుట్టిన దుస్తులు వేసుకొచ్చారు. హెడ్ మాస్టర్ బొలగం శ్రీనివాస్ తదితరులున్నారు.

బోయినపల్లిలో నిర్వహించారు. మండల టైలర్స్ అసోసియేషన్ నాయకులు ఆడెపు నర్సయ్య, మాడిశెట్టి శ్రీనివాస్ మాట్లాడారు. మాడిశెట్టి నరేందర్, మాడిశెట్టి రామదాసు, వెంకన్న, బండారి రాజమల్లు, అలువాల శ్రీనివాస్, మ్యాన మల్లేశం, పురుషోత్తం తదితరులున్నారు.

ఫైర్ సేఫ్టీపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఫైర్ స్టేషన్ అధికారి అనిల్‌కుమార్

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వేములవాడ ఫైర్ స్టేషన్ సిబ్బంది ఫైర్ సేఫ్టీపై శుక్రవారం అవగాహన కల్పించారు. మార్చి 5 నుంచి ఇంటర్ పరీక్షలు దృష్టిలో ఉంచుకొని పరీక్షల కేంద్రంలో ఫైర్ సేఫ్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఫైర్ స్టేషన్ అధికారి అనిల్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులున్నారు.

తంగళ్లపల్లి: బద్దెనపల్లి తెలంగాణ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ఫైర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్టేషన్ ఫైర్ అధికారి నరేందర్ మాట్లాడారు. ఫైర్ సిబ్బంది నర్సింహచారి, గణేశ్, ప్రవీణ్‌కుమార్, సాబీర్, సాయికిరణ్ పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా పని చేయాలి

వీర్నపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉపాధిహామీ పథకం క్షేత్ర సహాయకులతో మండల అభివృద్ధి అధికారి అబ్దుల్ వాసిత్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధిహామీ పథకం క్షేత్ర సహాయకులు తమ వృత్తిలో బాధ్యతాయుతంగా పని చేస్తూ ఆదర్శంగా నిలవాలని అన్నారు. ఉపాధిహామీ ఏపీవో శ్రీహరి పాల్గొన్నారు.

ప్రభుత్వం నిర్వహించిన కులగణన సర్వే మిగిలిపోయిన కుటుంబాలను గుర్తించేందుకు చేపట్టిన రీసర్వే గడువు శుక్రవారంతో ముగిసింది. మండల కేంద్రానికి చెందిన మండేపల్లి రాజం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోకు తమ కుటుంబ సభ్యుల నమోదు వివరాలను అందజేశారు.

చివరి ఆయకట్టుకు సాగునీరందించండి



వినతిపత్రం అందిస్తున్న నవీన్

ముస్తాబాద్: మండలంలోని గ్రామాలకు ఎగువ మానేరు ప్రాజెక్టు ద్వారా సాగునీటిని అందించాలని నీటిపారుదల శాఖ ఈఈ అమరేందర్‌రెడ్డికి శుక్రవారం రైతు నాయకుడు నవీన్ వినతిపత్రం అందించారు. తెర్లుమద్దిలోని చివరి ఆయకట్టు భూములకు ప్రతి వారంలో రెండు రోజులు నీటిని అందిస్తున్నట్లు రికార్డులో పేర్కొంటున్నారని తెలిపారు. వాస్తవానికి ఒక్కరోజు కూడా యాసంగి పంటలో సాగునీటినందించడం లేదన్నారు. లష్కర్లు, ఇరిగేషన్ సిబ్బంది, అధికారులు సరైన పర్యవేక్షణ చేయకపోవడంతో ప్రాజెక్టు చివరి ఆయకట్టు భూములు ఎండిపోతున్నాయని అన్నారు.

పెరుగుతున్న నిర్లక్ష్యం..



కోనరావుపేట: మర్తనపేట నుంచి నాగారం వెళ్లే దారిలో కల్వర్టు ప్రమాదకరంగా మారింది. విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో ఉన్న కల్వర్టుకు ఒకపక్క గత వర్షాలకు కొట్టుకుపోయింది. అప్పటి నుంచి ఇక్కడ ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో గతేడాది కొద్దిగా ఉన్న గుంత పెరుగుతోంది. ఈ రహదారిపై ప్రతిరోజూ అధిక సంఖ్యలో వాహనాల రాకపోకలుంటున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.